# నీవు నేర్పిన విద్యయే

రచన: బి. విద్యాసాగర్

తలుపు చప్పుడయినట్లు వినిపించింది. కేశవరావు వెళ్ళి తలుపుతీశాడు. రాజారావు వస్తునే "ఏమి చేస్తున్నావోయ్ యింట్లోకూర్చుని?" అన్నాడు.

"ఏమిలేదు! వారపత్రిక చదువుతూ కాలక్షేపం చేస్తున్నాను" అన్నాడు కేశవరావు.

ఆదివారంకూడా యింట్లో కూర్చోవడమేమిటి?"

"ఏమిచేయమంటావు! బాగా యెండగావుంది"

కాస్త చల్లపడ్డాక మా క్లబ్బుకి వెళ్దాముర! వీరాంజనేయులుగారని ఒక మహానుభావుడున్నాడు. ఆయన షోకుగా కోతలు కోస్తాడు, ఆయన మాటలు నిజమని భావించి మా మెంబర్సు శ్రద్ధగా వింటారు. కొంతమంది యివి కోతలు అని భావించి, ఆయనను యేడిపించడానికి శ్రద్ధ కనపరుస్తూ ఆయనకు మరింత ఉత్సాహం కలిగిస్తారు దానితో ఆయన విజృంభించి లేత సొరకాయలు కోసిపారేస్తాడు," అన్నాడు రాజారావు

'అయితే, ఆతమాషా యేమిటోచూడాలి' అన్నాడు కేశవరావు, ఇద్దరూ కాఫీ త్రాగారు

సాయంత్రం యిద్దరూ క్లబ్బుకు వెళ్లారు అప్పటికి సభ్యులంతా విచ్చేసి వీరాంజనేయులుగారి 'హరికథ' వింటున్నారు, అంజనేయులుగారు విజృంభించి వుత్సాహంతో తన వీరగాధ చెపుతున్నాడు.

"అప్పుడు ఏమిజరిగిందనుకున్నారు! ఆ దొంగ కన్నంవేసి నిశ్శబ్దంగా యింట్లోకి జొరబడ్డాడు. ఇంట్లోవాళ్ళంతా హడలిపోయారు. ఎవరి పక్కమీద వారు ముసుగు కప్పి పడుకున్నారు, ఇక వూరుకుంటే లాభంలేదని, నేను పక్కమీద లేచికూర్చొని, దిండుక్రిందవున్న రివాల్వర్ చేత పుచ్చుకొన్నాను. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ పక్క గదిలోకి వెళ్ళాను. అప్పటికి ఆ దొంగవెధవ పెట్టె తెరచి సోదాచేస్తున్నాడు. వాడికి కావలసినవన్నీ, ఒక గుడ్డపరచి దానిమీద పడేసుకుంటున్నాడు. ఇక మూట కట్టుకొని వాడు పారిపోదామనుకునే సమయంలో, నేను నిశ్శబ్దంగా వాడి వెనుకగా వెళ్ళి, వాడిని గట్టిగా పట్టుకొని 'దొంగ, దొంగ' అంటూ పెద్దగా కేకవేశాను."

"ఆ! అప్పుడు యేమయింది!"

"నా కేకవిని మా యింట్లో వాళ్ళు, పక్కయిళ్ళవాళ్ళు పరుగెత్తుకువచ్చారు ఈ లోపల దొంగ పారిపోదామని నాతో పెనుగులాడాడు. కాని నేను వాడిని వదిలిపెడితేగా! గట్టిగా మెడ పిసికేశాను. వాడు గిలగిల తన్నుకున్నాడు, ఇంతలో అంతా వచ్చి వాడిని బయటకు లాక్కెళ్ళి ఒక చెట్టుకు కట్టేసి; చావచితక బాదారు."

"మీ చేతిలో రివాల్వర్ వుందికదా? ఎందుకు దానిని ఉపయోగించలేదు". అన్నారు ఒకరు

"దానిని ఉపయోగిస్తే నా గొప్పతనం యేముంది! అది పిరికివాళ్ళు చేయవలసిన పని. అదీగాక, వాడిని చంపితే, లేనిపోని హత్యానేరం తలకు చుట్టుకుంటుంది, అందుకని; బలప్రయోగంతో వాడిని లొంగదీయాలని భావించాను" తనని సమర్ధించుకున్నాడు వీరాంజనేయులు.

"అతను తిరగబడి మిమ్మల్ని తంతే యేమి చేసేవారు?" అన్నాడు రాజారావు యేడిపించాలని

"వాడికి అటువంటి అవకాశం నేను యిస్తేగా? ఒకవేళ అటువంటి పరిస్థితి ఏర్పడితే, ఫైర్ చేసి వాడిని అంతమొందించేవాడిని! దానికేమిటికాని, ఒకసారి నంద్యాల ఫారెస్టులో నేనూ, మా అన్నయ్యా ఫైర్ చెయ్యకుండా ఒక చిరుతపులిని చంపాము"

"ఏమి రివాల్వర్ తీసుకు వెళ్ళలేదా?"

"ఎందుకు తీసుకు వెళ్ళలా! తీసుకు వెళ్లాము. కాని రివాల్వర్ మా అన్నయ్య దగ్గరవుంది. వాడు ముందు నడుస్తున్నాడు నేను వెనుక నడుస్తున్నాను. ఇంతలో యెక్కడ నుంచి వచ్చిందో యేమో! ఒక చిరుతపులి నన్ను చూచి నా మీదకు వురికింది. నాకు ఏమి చేయడానికి తోచలేదు, మా అన్నయ్య కొద్దిగా భయస్తుడు. అందువలన రివాల్వర్ తనదగ్గర వుంచుకున్నాడు నా చేతిలో ఒక కర్రమాత్రం వుంది. దానితో మీదకు వస్తున్న చిరుతపులిని బలంగా కొట్టాను. అది కాస్త దూరంలోవెళ్ళి క్రింద పడింది. కాని మళ్లీ విజృంభించి నా మీదకు వురికింది. ఇక వూరుకుంటే లాభంలేదని దగ్గరలోవున్న కొండరాయి ఒకటి యెత్తి దానిమీదకు విసిరాను. దానితో అది గిలగిల తన్నుకుంటూ క్రిందపడింది ఇంతలో మా అన్నయ్యకూడా నా దగ్గరకువచ్చాడు. ఇద్దరం చేతిలోవున్న కర్రలతో దానిని చావచితక బాది చంపేశాము." అన్నాడు గర్వంగాచూస్తూ

రాజారావు ఆయనను యేడిపించాలని "యింకేముంది కాని ఈమధ్య నేను ఒక త్రాచుపామును చంపాను. చేతిలో కర్ర కూడా లేదు." అన్నాడు.

"ఎలా చంపారు?" అన్నారు ఒకరు.

"నేను ఒకరాత్రి పొలాల మధ్యనుంచి నడచి వస్తున్నాను, కోతలుపూర్తయి కుప్ప వేసి కూలివాళ్ళు వెళ్ళిపోయినట్లున్నారు: జనసంచారంలేదు. అడ్డతోవకదా అని గట్టుమీదుగా నడచివస్తూంటే, కాలికి ఒకపాము తగిలింది. బ్యాటరీలైటు వేశాను. త్రాచుపాము పడగవిప్పివుంది. వెంటనే దగ్గరలో వున్న కొండరాయి ఒకటి తీసుకొని దానిమీదకు విసిరాను, గిలగిల తన్నుకు చచ్చింది."

"చిత్రంగావుందే! అదీ పనకొట్టం అంటే" అన్నాడు కేశవరావు. వీరాంజనేయులుగారు ముఖం ముడుచుకున్నాడు.